క్లుప్తంగా

ఎస్పీబీకి ఘన నివాళి



బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

హిందూపురం: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన భక్తి, జానపద, సినీగీతాలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. మంగళవారం స్థానిక నానెప్ప నగర్ కేవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు, సంగీత విభావరి నిర్వహించారు. మంచు మ్యూజిక్ మెలోడీస్ ఆర్కెస్ట్రా వ్యవస్థాపకుడు గాజుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మునిసిపల్ చైర్మన్ రమేష్ కుమార్, డీఎస్పీ మహేష్, సీఐలు రాజ గోపాల్‌నాయుడు, అబ్దుల్ కరీం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఎస్పీ బాలు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం కళాకారులు పాడిన పాటలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, రాజ్యలక్ష్మి, నాగరత్న మోహన్, మాళప్ప, సీజే మనోహర్, రంగారావు, ఉదయ్ కుమార్, ఉమర్ ఫరుక్, కళాకారుల ఐక్యవేదిక సభ్యులు అంజప్ప, చలపతి, శ్రీధర్, సంగీత కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ



ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శిస్తున్న వేణురెడ్డి

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని మోతుకపల్లిలో సోమవారం సాయంత్రం పిడుగుపడి నలుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. హిందూపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న రాకేష్, ఫణికుమార్‌రెడ్డి, తరుణ్, వంశీలను వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి మంగళవారం పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్‌గౌడ్, బూత్ కమిటీ అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, కౌన్సిలర్ మల్లికార్జున , లక్ష్మీనారాయణ, వార్డు ఇన్‌చార్జి న్యాతరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ సువర్ణ, వరున్‌రెడ్డి, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



ప్రమాదానికి గురైన కారు

మడకశిరరూరల్: మండల పరిధిలోని గొల్లపల్లి క్రాస్ వద్ద ఓ కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికుల వివరాల మేరకు.. వైబీ హళ్లి గ్రామం నుంచి మడకశిర వైపు వస్తున్న కారు సోమవారం రాత్రి గొల్లపల్లి క్రాస్ వద్దకు రాగా కుక్క అడ్డువచ్చింది. ఈ నేపథ్యంలో కుక్కను తప్పించబోయి పొలంలోకి దూసుకెళ్లి చెట్టును ఢీ కొంది. వైబీ హళ్లిలో జరిగిన ఆంజనేయ స్వామి, మారెమ్మ జాతర ఉత్సవాలు ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు చెబుతున్నారు. కారులో ఉన్న వారికి ఏమీ కాకపోవడంతో ప్రమాదం తప్పింది.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ



గాయపడిన బ్యాంకు ఉద్యోగి గంగరత్నమ్మ



గాయపడిన చిన్న వెంకటరాముడు

రొద్దం: ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పాతర్లపల్లి గ్రామ సమీపంలోని పెనుకొండ - పావగడ ప్రధాన రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు.. ఆర్ లోచెర్ల గ్రామానికి చెందిన గొల్ల చిన్న వెంకటరాముడు స్వగ్రామం నుంచి పెనుకొండ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదేసమయంలో పెనుకొండ వైపు నుంచి రొద్దం వైపు వస్తున్న కెనరా బ్యాంక్ ఉద్యోగి అడదాకులపల్లి గంగరత్నమ్మ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వెంకటరాముడికి కాలు మూడు చోట్ల విరిగినట్లు తెలిపారు. బ్యాంక్ ఉద్యోగి గాయాలతో బయటపడిందన్నారు. ఇద్దరినీ పెనుకొండ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వెంకటరాముడిని అనంతపురం తరలించారన్నారు.

ఏఓ బదిలీ

సోమందేపల్లి: వ్యవసాయశాఖ ఏఓ కవితారాణి చిలమత్తూరు మండలానికి బదిలీ అయ్యారు. పరిగిలో పనిచేస్తున్న విజయభారతి సోమందేపల్లికు బదిలీపై వచ్చారు. త్వరలో ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు. ఖాళీగా ఉన్న ఏఈఓ పోస్టును భర్తీ చేయాలని రైతులు కోరుతున్నారు.



రంగులు వెలసిపోయిన కుంభకర్ణుడి విగ్రహం



ధ్వంసమైన ప్రహరీ



పార్కులో మందు బాబులు మద్యం సేవిస్తున్న దృశ్యం (ఫైల్)

శిథిలావస్థలో కుంభకర్ణ ప్రాజెక్టు

- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

పెనుకొండ రూరల్: పెనుకొండ పట్టణ సమీపంలోని కుంభకర్ణ ప్రాజెక్టు శిథిలావస్థకు చేరుకుంది. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని 2002లో రూ.35 లక్షల వ్యయంతో కుంభకర్ణ ప్రాజెక్టు నిర్మించారు. అయితే పదేళ్ల క్రితం పర్యాటకశాఖ కుంభకర్ణ ప్రాజెక్టు నిర్వహణను టెండర్ ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పింది. నాటి నుంచి నేటి దాకా ఎలాంటి అభివృద్ధి జరగకపోగా, శిథిలావస్థకు చేరింది. కుంభకర్ణుడి విగ్రహం పగుళ్లు ఏర్పడి నెర్రెలు చీలింది. వర్షాల నేపథ్యంలో విగ్రహం కూలిపోయే అవకాశాలు కూడా లేకపోలేదని పర్యాటకులు చెబుతున్నారు. విగ్రహం లోపలి భాగం పిచ్చిరాతలతో కళావిహీనంగా మారింది. నిద్రించే కుంభకర్ణుడిని లేపేందుకు బటులు ప్రయత్నించే విగ్రహాలు కూడా పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రహరీ కూడా కూలేందుకు సిద్ధంగా ఉంది. దీనికితోడు కుంభకర్ణుడి ఆవరణలోని పార్కు అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్‌గా మారిందంటున్నారు.



నెర్రెలు చీలిన విగ్రహం



విగ్రహం లోపల పిచ్చి గీతలు



విగ్రహం కాలి భాగంలో ఇలా..

శిథిలావస్థకు చేరినా పట్టించుకోరా?



శ్రీకృష్ణ దేవరాయలు వేసవి రాజధానిగా పెనుకొండ ప్రాచుర్యం పొందింది. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలి. కుంభకర్ణ ప్రాజెక్టు శిథిలావస్థకు చేరుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం సరికాదు. వెంటనే కుంభకర్ణ విగ్రహానికి మరమ్మతులు చేయించి నూతనంగా రంగులు వేయాలి. టూరిజాన్ని ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలి.

– కొండలరాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు, పెనుకొండ

జోరుగా అసాంఘిక కార్యకలాపాలు



కుంభకర్ణ ప్రాజెక్టు నిర్వహణను పట్టించుకునే వారే లేకపోవడం బాధాకరం. విగ్రహం నెర్రెలు చీలి పెచ్చులూడుతోంది. దీనికి అసాంఘిక కార్యకలాపాలు జోరుగా జరుగుతున్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చెందాల్సిన ప్రాంతం ఇలా నిర్వీర్యమైపోవడం సరికాదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి.

– ఎంఎస్ మూర్తి, పెనుకొండ

పర్యాటక అభివృద్ధికి కృషి



కుంభకర్ణుడి ప్రాజెక్టు అభివృద్ధికి ఇప్పటికే ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపాము. త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతాము. అసాంఘిక కార్యకలాపాలకు చోటు లేకుండా నిత్యం పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటాము.

– నరసయ్య, పర్యాటకశాఖ జిల్లా ఇన్‌చార్జ్

ఫిట్‌నెస్ లేని బడిబస్సులపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో బస్సు ఫీజులను వసూలు చేస్తూ ఫిట్‌నెస్ లేని బడి బస్సులను నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీఓ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు, నిబంధనలు పాటించకుండా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫిట్‌నెస్ లేని బస్సులను నడుపుతున్నాయన్నారు. బడి బస్సుల్లో పరిమితికి మించి ఎక్కువ మంది విద్యార్థులకు తరలిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. బడి బస్సుల్లో విద్యార్థులకు సంబంధించి భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రాజు, నాగేంద్ర, అనుదీప్, నరసింహమూర్తి, విన్ని, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీఓ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

శ్రీచైతన్య విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లక్షలాది రూపాయలు దండుకుంటున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. నరసింహమూర్తి మాట్లాడుతూ పుస్తకాల పేరిట వేల రూపాయల వ్యాపారం చేస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థ విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. యూకేజీ నుంచి 10వ తరగతి వరకూ రూ.24 వేల నుంచి రూ.42 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అలాగే పాఠశాలలోనే పాఠ్యపుస్తకాలు, ఇతర సామగ్రి కొనాలని నిబంధన పెట్టి రూ.9 వేల వరకు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు చంద్రశేఖర్, శివ, మహేష్, ప్రభాకర్, అభిలాష్, సునీల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీచైతన్య పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రం రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను రైతులకు పంపిణీ చేశారు. రైతులు విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా వ్యవసాయ అవసరాల కోసం నూతనంగా కిసాన్ డ్రోన్‌ను ప్రారంభించారు.

అగళి: మండల పరిధిలో 11 రైతుసేవ కేంద్రాలలో రైతులకు రాయితీపై వేరుశనగ విత్తనలను మంగళవారం పంపిణీ చేశారు. మండలనికి 1000 క్వింటాళ్ల విత్తనం వచ్చినట్లు ఏఓ శేఖర్ నాయక్ తెలిపారు

అమరాపురం: మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయం ఆవరణలో మంగళవారం వేరుశనగ విత్తన పంపిణీ ప్రారంభమైంది. మండలంలో మొత్తం 1503 మంది రైతులకు 1353 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయను పంపిణీ చేసినట్లు ఏఓ మంజునాథ్ తెలిపారు.

పెనుకొండ రూరల్: నేటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు నేఓ చందన తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాల్లో 40 శాతం రాయితీతో పంపిణీ చేస్తామన్నారు.

చిలమత్తూరు: వేరుశనగ సాగు చేసే రైతులకు బుధవారం నుంచి సబ్సిడీ విత్తన కాయలను పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి వంశీకృష్ణ పేర్కొన్నారు. 909 మంది రైతులకు 727.5 క్వింటాళ్ల విత్తన కాయలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



అగళి: విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న ఏఓ శేఖర్‌నాయక్

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

గుడిబండ: చదువుతోనే బాలికలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని వెలుగు సీసీ శ్రీధర్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఫళారం గ్రామంలో కిశోర బాల బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. శ్రీధర్ మాట్లాడుతూ బాలికలకు శారీరక, మానసిక స్థితిపై కచ్చితంగా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలన్నారు.

అమరాపురం: బాల్య వివాహాలు చేయడం నేరమని గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ గంగరత్న పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని ఎంపీడీఓ రామరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. బాల్య వివాహాలు చేసుకుంటే జరిగే అనర్థాలను గురించి వివరించారు. అలాగే మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: మండలంలో ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలపై అవగాహన పెంచుకుని చిన్న వయస్సులో బాలికలకు వివాహాలు చేయకుండా ఉన్నత చదువులు చదివించాలని సూపర్ వైజర్ లీలావతి తెలిపారు. ఐసీడీఎస్ అధ్వర్యంలో పట్టణంలోని కోటవీధి, ఎస్సీ కాలనీ, 7వార్డు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ముగిపు సందర్భంగా కిశోరి వికాసం కార్యక్రమాలను నిర్వహించారు.



మడకశిరలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

హామీలు అమలు చేయండి

సోమందేపల్లి: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే మంగళవారం తహసీల్దార్ మారుతీకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో హామీలిచ్చి అవి అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు 200 రోజులు పని కల్పించి రూ.700 కూలి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజ్‌గోపాల శీలా నారాయణ స్వామి, బాబ్జాన్, రామాంజనేయులు, మల్లేష్ తదితరుల పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మడకశిర: మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ కౌన్సిల్ మీట్ జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ సమావేశానికి అధ్యక్షత వహించారు. కౌన్సిలర్లు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో కమిషనర్ రంగస్వామి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడండి



పరిగి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు



అమరాపురంలో..



రొళ్లలో ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

పరిగి: ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న పత్రికల స్వేచ్ఛను హరించడం రాజ్యాంగ విరుద్ధం, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని జర్నలిస్టులు కోరారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్టు చేయడం, రాష్ట్రంలో పలు సాక్షి ఎడిషన్ కార్యాలయాలపై దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏఎస్ఐ వెంకటేశులుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సాక్షి విలేకరి శ్రీనివాసులు, జంగాలపల్లి గిరి, జియావుల్లా అలియాస్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: సాక్షి కార్యాలయాలపై దాడులు చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని అమరాపురం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పోలీసులకు సాక్షి విలేకరి తిప్పేస్వామి ఫిర్యాదు చేశారు. సాక్షికి సంబంధం లేని విషయాలను అంటగడుతూ తమ కార్యాలయాలపై దాడులు చేయడం అమానుషమన్నారు. అలాగే జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్ అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తున్నామన్నారు. ఆయన వెంట నాగరాజు, చంద్రప్ప తదితరులున్నారు.

సోమందేపల్లి: పత్రికా స్వేచ్ఛను హరిస్తు సాక్షి కార్యాలయాలపై దాడులకు దిగిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులు ఏఎస్ఐ ధనుంజయకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి తప్పు చేయని కొమ్మినేని శ్రీనివాస్‌రావుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు మురళీ, జాకీర్, వాసు, మహేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: రాష్ట్రంలో సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడుతున్న దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని మంగళవారం స్థానిక ఎస్ఐ వీరాంజనేయులుకు పాత్రికేయులు ఫిర్యాదు చేశారు. అలాగే సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్‌పై పెట్టిన అక్రమ కేసును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే అక్రమ కేసును ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు టీడీ రవి , హనుమంతరాయప్ప , భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

టీబీ నిర్ధారణకు గళ్ల పరీక్ష



అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

హిందూపురం: టీబీ వ్యాధి లక్షణాలుంటే వెంటనే గళ్ల పరీక్షలు చేయించి నియంత్రణ చర్యలకు కృషి చేయాలని టీబీ కంట్రోల్ సూపర్‌వైజర్ గాస్‌పీర్ తెలిపారు. మంగళవారం బోరెడ్డిపల్లిలో టీబీ క్యాంపైన్ నిర్వహించారు. కుటుంబంలో 18 కేజీల కన్నా తక్కువ బరువున్నా, షుగర్ వ్యాధిగ్రస్తులు, గత రెండేళ్లగా కుటుంబంలో ఎవరైనా టీబీ పేషెంట్లు ఉన్నా, పొగతాగువారే, ఆరోగ్య సర్వే జరుపుతున్నట్లు చెప్పారు. టీబీ లక్షణాలు ఉంటే గళ్ల పరీక్షలు, ఎక్స్‌రే కోసం హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య వైద్యసిబ్బంది, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం



అలంకరణలో సత్యనారాయణస్వామి

హిందూపురం: పట్టణంలోని సత్యనారాయణపేటలోని ఆలయ సేవా సమితి ఆధ్వర్యంలో 18వ వార్షికోత్సవ మహాపూజ కార్యక్రమాలు మంగళవారం ఘనంగా జరిగాయి. మూలవిరాట్ సత్యనారాయణస్వామికి పంచామృతాభిషేకాలు చేసి పూజలు చేశారు. ఆలయ ముఖ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంతో పాటు మహిళా మండలి సభ్యులచే విష్ణు సహస్రనామ పారాయణం, సామూహిక లలిత సహస్ర నామ పారాయణలు చేపట్టారు. అనంతరం స్వామి వారికి పుష్పార్చన చేశారు.

మడకశిర మున్సిపల్ కమిషనర్‌గా జగన్నాథ్

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ కమిషనర్‌గా జగన్నాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇంత వరకూ మడకశిర మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా రంగస్వామి వ్యవహరించారు. తాజాగా కమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జగన్నాథ్‌ను ప్రభుత్వం నియమించింది. నేడోరేపో నూతన కమిషనర్‌గా జగన్నాథ్ బాధ్యతలు స్వీకరిస్తారని అధికారులు తెలిపారు.

తుంగభద్ర నీరు వృథా



వృథాగా వెళ్తున్న తుంగభద్ర నీరు

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట హోబళి మేఘల పాళ్య గ్రామంలో తుంగభద్ర తాగునీటి పథకం కింద 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో భారీ ట్యాంకు నిర్మించారు. అయితే పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతో వాటర్ ట్యాంకు నిండి పొంగి పొర్లుతోంది. నెలకు పైగానే అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉన్న పేద రైతు రామమూర్తి కొండ బుడుము ప్రాంతంలోని తన పొలంలోకి వృథా నీటిని తరలించి మొక్కజొన్న పంట సాగుచేస్తూ పలువురి ప్రశంసలు పొందారు. రూ.3 వేల కోట్లతో నిర్మిస్తున్న తుంగభద్ర తాగునీటి పథకం దాదాపుగా పూర్తి కావస్తోంది. అయితే జిల్లా పంచాయతీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నీరు వృథా అవుతోందని, ఇప్పటికైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పూల మండీలను యథాస్థానాల్లోనే నిర్వహించాలి



ఆందోళన నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ: స్థానిక మున్సిపల్ బస్టాండు సమీపంలో యథాస్థానాల్లోనే పూల మండీ వ్యాపారాలు కొనసాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక కర్ణాటక రాజ్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప డిమాండ్ చేశారు. స్థానిక తాలూకా కార్యాలయంలో ఎదుట మంగళవారం నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యాపారులు, ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకోవాలన్నారు. వెంటనే యథా స్థానాలలోనే పూల మండీలు ఏర్పాటు చేయాలన్నారు. లేకపోతే మున్సిపల్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.